గొడుగు

ఈ వాన పూర్తిగా ఆగదు, జోరుగా సాగదు. తన జీవితం లాగానే వుంది సుమిత్రకి. ఆ బస్‌స్టాప్‌లో ఎవరైతే కనబడకూడదు అనుకుందో అతనే కనిపించాడు. ఈ దేశంలో నేనొక్కడినే పురుషోత్తముడను అన్నట్లు రెండు చేతులూ వెనుక పెట్టుకుని 'నాకు ఎదురు లేదు' అన్నట్లు నిలబడతాడు. అయినా తనకెందుకు? నీ దారి నీది, నా దారి నాది అని ఆరు నెలల క్రితం చెప్పేసి వెళ్లిపోయింది తను. ఆ బస్‌స్టాప్, ఆ వాన, ఆ మనిషి, ఆ పరిచయం... అసలు అవన్నీ జరగకుండా ఉండవలసింది. జరగకూడనిది జరిగేటప్పుడే అసలు ఈ వాన కురుస్తుందని తన నమ్మకం. వాన అంటేనే తనకి ఒక అడ్డం. ఏదీ సాఫీగా సాగదు. సమయం అంతా వృథా. కానీ వానలు కురవాలి. వాన లేకుండా జీవితం లేదు. పెళ్లి కూడా అంతే! స్వాతంత్ర్యం కోల్పోవాలి. జైల్లోకి వెళ్లాలి. అయినా చేస్కోవాలి... వాట్ నాన్‌సెన్స్. చూడు ఎలా కురుస్తోందో... ఆ రోడ్డు మీద టప్పు టప్పున కురుస్తూ ఆ మోత ఒకటి! భార్యాభర్తలు పోట్లాడుకుంటున్నట్లు! ఒక చినుకు ఇక్కడ, మరొకటి అక్కడ... దంచుకుంటూనే వుంది...

ఆరు నెలల క్రితం ఈ బస్‌స్టాప్‌లోనే నిలబడింది. ఆఫీస్‌లో చెప్పేసి ఇంటికి బయలుదేరింది. బస్సువాడు అక్కడ దింపేసి ఇంక నీ ఖర్మ అంటూ వెళ్లిపోయాడు. నాలుగు అడుగులు వేస్తే ఇల్లు. సుమిత్రకి ఇది మామూలే! సినిమా హాల్లో టికెట్ కోసం లైన్లో నిలబడి కౌంటర్ దాకా వెళ్లేసరికి టికెట్లు అయిపోతాయి. తనకి కావలసిన ప్రోగ్రామ్ టి.వీ.లో చూడాలని అనుకుంటూ అన్నీ సర్దుకోగానే కరెంట్ పోతుంది. ఇంట్లో వుంటే కేబుల్ వాడి దగ్గర పోతుంది. చాలా ముఖ్యమైన పని ఇంట్లో వుంటే అదే రోజు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంటుంది. ఈ పురుషపుంగవుడు తనని చూస్తూ నిలబడ్డాడు. చేతిలో గొడుగు పట్టుకున్నాడు. ఆఫీసు నుంచి ఎలాగో అలాగ తప్పించుకుని ఇక్కడ దిగింది. నాలుగు అడుగులు వేస్తే తన ఇల్లే. కానీ ఇదిగో... విధి లీలల్లో అద్భుతమైన డిసైన్ –

ప్రతిసారీ ఇలా జరగాల్సిందే. బస్సులో ఉన్నంతసేపూ వాన లేదు. ఇలా దిగింది – ఈ అంతు లేని వాన. ఆగుతుందేమోనని ఆశగా చూసింది. లేదు. ఆ గొడుగు మనిషి ఆశగా చూస్తున్నాడు. గొడుగు చేతిలో వున్నప్పుడు అలా వెళ్లిపోవచ్చు కదా? ఏమో, బస్సు కోసం కావచ్చు.

'బాగా వానగా వుందండీ' అన్నాడు.

తను చేతులు కట్టుకుంది. సమాధానం చెప్పలేదు. ఈ మగాళ్లందరూ ఇంతే.

'ఇది శారదానగర్ బస్‌స్టాపే కదండీ?'

'అవును'.

అతను ఆ గొడుగు పట్టుకుని దగ్గరగా వచ్చాడు. జేబులోంచి ఓ కాగితం తీశాడు.

'మీరు ఈ కాలనీలోనే వుంటున్నారా?' అడిగాడు.

'అవునండీ'

'కాస్త ఈ అడ్రస్ చెబుతారా?'

అడ్రస్ జాగ్రత్తగా చదివింది.

'నేనూ అదే ప్రాంతానికి వెళ్లాలండీ. కాకపోతే వాన'.

అతను తన గొడుగును వజ్రాయుధం ఇవతలకి తీసినట్లు తీశాడు.

'నా దగ్గర గొడుగుంది. ఫరవాలేదు. రండి'

సుమిత్ర ఆలోచించింది. బాగుండదేమో. ఎవరైనా చూస్తే... అసలే పెళ్లి కాని పిల్ల.

'వాన ఆగిపోవచ్చండీ'

వేదాంతం శ్రీపతిశర్మ

అతను వదలలేదు.

'ఇది ఆగే వాన కాదు. రండి... పోనీ ఎంత దూరం వుంటుంది?'

'పది నిమిషాల నడక. అంతే'

అతను రోడ్డు మీదకి వెళ్లి గొడుగు విప్పేశాడు. ఏమీ చెయ్యలేక అందులోకి దూరింది. గొడుగు జాగ్రత్తగా పట్టుకున్నాడు. ఎవరి నడక వారిదైనా గొడుగు సృష్టించిన నియమం వలన ఒకరి నడకను ఒకరు పరిశీలించుకుంటూ జాగ్రత్త పడుతూ కాలనీలోకి వచ్చేశారు.

'మీరు వెళ్లవలసిన ఇల్లు ఇదే'.

అతను అటూ ఇటూ చూసి గొడుగు అలానే పట్టుకున్నాడు.

'మిమ్మల్ని మీ ఇంటిలో దింపి నేను మరలా ఇక్కడికి వస్తాను. వాన తగ్గలేదు మరి'.

తను గొడుగు లోంచి ఇవతలకి వచ్చి గేటు తెరిచి నాలుగు అడుగులు గబగబా వేసి, వెనక్కి తిరగకుండానే చెప్పింది. 'ఇది మా ఇల్లే. ఇలా లోపలికి వెళ్లండి' అని ముందు ద్వారం చూపించి, ఎందుకో సిగ్గుతో పెరట్లోకి వెళ్లిపోయింది.

ఏం పెళ్లికొడుకో ఏమో! ఇలా ఒంటరిగా వానలో గొడుగుతో వచ్చాడు. తనకి జరిగే పెళ్లిచూపులకి ఇలా తనే పెళ్లికొడుకుని వెంట పెట్టుకురావాల్సి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. కాఫీ గ్లాసులు ప్లేట్లో పెట్టుకుని ముందు గదిలోకి వచ్చింది. నాన్నగారు గొంతు సర్దుకున్నారు. 'అయ్యా సుబ్బారావుగారూ, ఇదిగో మా అమ్మాయి సుమిత్ర. చూడమ్మా, వారే సుబ్బారావుగారు', అని మరలా దగ్గారు. ఇన్నాళ్లూ తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి చేతికి చిక్కినట్లు ఆయన్ని అలా చూపిస్తూనే వున్నారు. సుబ్బారావు తన గొడుగుని మూలగా పెట్టి, కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నాడు. ఎందుకో ఒక వెర్రి నవ్వు నవ్వి, కాఫీ కప్పు అక్కడ పెట్టింది. బస్‌స్టాప్‌లో కలుసుకున్న సంగతి మాట్లాడతాడేమో అనుకుంది. అలాంటిదేమీ మాట్లాడలేదు. గొడుగుతో పొడుస్తున్నట్లే తనని చూస్తున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్న ట్లున్నాడు.

'గొడుగు అనే వస్తువు మీద మీ అభిప్రాయం చెబుతారా?' అడిగాడు. అందరూ ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నారు. ఇతని ఉద్యోగం, సంప్రదాయం, సర్వం మంచివే. సింపుల్‌గా వున్నాడు. ఈ ప్రశ్నే వింతగా వుంది.

'గొడుగు గురించి ఏం చెబుతామండీ?'

అందరూ నవ్వారు. అతను నవ్వలేదు, తొణక లేదు.

'అలా కాదు...' అన్నాడు. '... రెయిన్‌కోట్ల కాలంలో కూడా గొడుగు అవసరమా? ఇది నిత్యం దగ్గర పెట్టుకుంటే చూసేందుకు చిరాకుగా లేదా? ఇటువంటి ఆలోచనలు కలుగవా?'

ఆలోచించింది. తనలో ఏదో వెతుకుతున్నాడు. అర్థమయింది.

'గొడుగు అవసరం లేదనుకోవడం పొరపాటు...', చెప్పింది '... ఎంతో మంది గొడుగు వాడుతున్నారు'.

'నేను అడిగానని చెబుతున్నారా? లేక నిజం చెబుతున్నారా?'

నాన్నగారు ఎందుకో లోపలికెళ్లి వచ్చారు. ఒక పాత గొడుగు పట్టుకొచ్చారు.

'అయ్యా, దీనిని ఇప్పటికీ వాడతాము', అన్నారు.

అతను లేచి నిలబడ్డాడు. అందరూ నవ్వారు. అతను తన గొడుగు తీసుకుని చేతులు కలిపాడు. చెరో గొడుగు వేసుకుని ఇద్దరూ బస్‌స్టాప్ వరకూ వెళ్లిపోయారు. రెండు గొడుగులూ ఏం మాట్లాడుకున్నాయో ఏమో... తన పెళ్లి మటుకు అతనితో అయిపోయింది...

తొలిరాత్రి ఇద్దరి చేతా ఎంతో మందికి తాంబూలాలు ఇప్పించారు. నీరసం వచ్చింది. దేశంలో ఇందరు వృద్ధులు అసలు ఎందుకున్నారా అని ఆశ్చర్యం వేసింది! అందరూ వెళ్లిపోయాక అతనూ ఎందుకో వెళ్లిపోయాడు. ఏమీ తోచక కిటికీ దగ్గర నిలబడింది. 'దృశ్యం చాలా బాగుంది' వెనుక నుండి వినపడింది. అటు తిరిగింది. పట్టు వస్త్రాలలో కొత్త పెళ్లి కొడుకు చేతిలో గొడుగు పట్టుకుని వున్నాడు. దానిని తీసుకొచ్చి మూలగా నిలబెట్టాడు.

'ఏ దృశ్యం?' అడిగింది.

'కిటికీ లోంచి కనిపిస్తున్న దృశ్యం. చక్కని చంద్రుడి మీద చిక్కని మేఘం ఎంచక్కా ఒక గొడుగు పట్టుకున్నట్లు వుంది!'

తనకి ఆ కిటికీలోంచి దూకెయ్యాలనిపించింది.

'ఈ రాత్రి కూడా మనకి ఈ గొడుగు గురించి ఎందుకండీ?'

'పొరపాటు! గొడుగు సామాన్యమైనది కాదు. దానిని తొలుత వామనమూర్తి తీసుకుని వచ్చాడు. గుళ్లలో కూడా అడపాదడపా పెరుమాళ్లు వారికి ఒక గొడుగు పట్టుకుని నాలుగు వీధులూ తిప్పుతారు...'

'ప్లీజ్!' అని పక్కకు జరిగింది సుమిత్ర. తనను లాగినట్లయి ఒక్కసారి సిగ్గుతో రెండు చేతులలో ముఖం దాచుకుంది. ఈ గొడుగు వీరుడు ఇంత సరసుడా? అనుకుంది. మెల్లగా వెనక్కి చూసింది. తన కొంగు లాగింది అతను కాదు. గాలికి ఆ కొంగు గొడుగు కొమ్ముకు తగిలి ఇరుక్కుంది. అతను నడుము మీద చెయ్యి పెట్టి విజయగర్వంతో పొంగిపో తున్నాడు! తలచుకుంటే ఇప్పటికీ రోషం ఆగదు.

చిన్నప్పటి నుంచీ ఈ మనిషి పుట్టగొడుగులు తినేశాడో లేక విప్పిన గొడుగునే ఉయ్యాలలా వేసుకుని ఊగేశాడో తెలియదు కానీ తను కేవలం ఒక గొడుగుకు భార్యగా వచ్చిందనుకుంది. ఎక్కువ మాట్లాడితే ఆ గొడుగే లేకపోతే అసలు కలిసే వాళ్లమే కాదు అనేవాడు. రోజులు గడిచాయి. కాకరొత్తు మీద నిప్పులాగా కాలం అలా కాలుతూనే కరుగుతూ తరుగుతూ అలా చెరిగిపోయింది. తన మనసూ విరిగిపోయింది. ఆఫీసుకు బస్సుల్లో ప్రయాణం చేయలేక, అత్త మామలతో 'కలసిపోలేక' ఒక రోజు గొడుగు సుబ్బారావు గారికి మనవి చేసుకుంది.

'ఏమండీ'

'యస్?'

'మనం వేరే వుందామండీ!'

'ఎందుకు?'

'ఆలోచించండి. నేను చెబితే బాగుండదు.'

అతను లేచి నిలబడ్డాడు. 'సుమిత్రా, పెద్ద వారి అండదండలు గొడుగులా మనల్ని కాపాడుతూ వుంటాయి. పాతవన్నీ అపాత మధురాలు. వాటిని తృణీకరించకూడదు. ఈ గొడుగే లేకపోతే...' మూలన వున్న గొడుగు తీసి పట్టుకున్నాడు. తనకి కోపం తారాస్థాయిని దాటింది. గబగబా అతని చేతిలోంచి ఆ నల్లని గొడుగును లాక్కుని హాల్లోకి నడిచింది. అతనూ వెంట వచ్చాడు. మామగారు హోమియోపతీ పుస్తకం చదువుతున్నారు. ఇద్దరి గొడవా చూసి 'ఇద్దరూ కాలీఫాస్ వాడాలి!' అన్నారు. తను మారు మాట్లాడలేదు. 'మిస్టర్ సుబ్బారావ్!...' గర్జించింది, '... ఈ గొడుగో నేనో తేల్చుకోండి' అని అరిచి దానిని వాకిట్లోకి విసిరి కొట్టింది. పెద్దాయన పుస్తకం మూసేసి నిలబడ్డాడు. సుబ్బారావు బరువుగా వాకిట్లోకి వెళ్లాడు. ఇంత బ్రతుకూ బతికి ఇంటి ముందు చచ్చినట్లు ఆ గొడుగు అక్కడ ఛిన్నాభిన్నమై పడి వుంది. అతను దానిని నిదానంగా పైకి తీశాడు.

సినిమా హీరోలా తనవైపు చూశాడు. మెల్లగానే అన్నాడు...

'కాల ప్రవాహానికి కొట్టుకుపోయే వారిని కాలం ఏ రోజూ అపదు. అనంత జీవనవాహిని లోకి కాలువలా కొట్టుకుని వచ్చావు. గొడుగు లోంచి నేను చెబుతున్నవి మామూలు మాటలు కావు...

అతను మాట్లాడుతూండగానే తను పెట్టె సర్దుకుని వచ్చేసింది. అతను గొడుగుతోనే గేటు తెరిచాడు... సుమిత్ర రోడ్డు మీదకి వచ్చేసింది!

ఆరు నెలలు గడిచాయి. గొడుగు దగ్గర నుంచి ఏ సమాచారం లేదు. తనూ పట్టించు కోలేదు. అప్పుడప్పుడూ తన వెర్రితనం మీద బాధ కలిగేది. ఆ గొడుగు ఏం చేసింది? ఆలో చించినప్పుడల్లా ఎందుకో గింజుకునేది! ఇంత కాలానికి మరలా ఈ బస్‌స్టాప్‌లో మరలా ఇదే వానలో నిలబడింది. ఆ మనిషి అలానే అదే స్థానంలో నిలబడ్డాడు. కదలడు, వదలడు. అస లు ఎందుకు వచ్చాడు మళ్లీ? ఇంటికి వచ్చి గొడవ చేస్తాడా? అసలు తను ఎందుకు చూ డాలి అతని వైపు? సన్నగా చూసీ చూడనట్లు చూసింది. అరె! అతను ఆ గొడుగును అక్కడే మరిచిపోయి వెళ్లిపోతున్నట్లున్నాడు. బస్‌స్టాప్ బెంచ్‌కి అన్చి వుంచాడు. వాన పడుతోందో లేదోనని చెయ్యి చాచి చూసుకుంటున్నాడు. ఎవరో ఒక జంట గబగబా లోపలికి వచ్చారు. చేతిలో గొడుగు తీసి మూసేశారు. వాళ్ల కుర్రా డొకడు రెయిన్ కోట్లో వున్నాడు. వాడు కిందకి దిగి నీళ్లల్లో చిందులు వేస్తున్నాడు.

'ఏమండీ...', ఆమె అంటోంది, '... మనం కూడా రెయిన్ కోట్లు కొనుక్కుందాం?'

'ఎందుకు? అక్కర్లేదు...', అతను అంటు న్నాడు. '...మన ముందు స్వేచ్ఛగా వాడు ఆడుకోవాలి. మనకి గొడుగు చాలు. ఏమం టావు?'

వాన ఆగిపోయింది. రాత్రంతా వాదనలో గడిచి, తెల్లవార్లూ పోట్లాడుకున్న ఓ జంటకు తెల్లవారినట్లుంది. ఇటు చూసింది. సుబ్బారావు వెళ్లిపోతున్నాడు. అరె! గొడుగు మరిచి పోయా డు. గబగబా గొడుగు తీసుకుని అతని వెంట వెళ్లింది. గొడుగు తిరిగి ఇవ్వడంలో తప్పు లేదు...

'మీ గొడుగు!'

అతను ఆగాడు. తనని చిత్రంగా చూసి గొడుగు తీసుకుని విప్పాడు.

'నాకు తెలుసు సుమిత్రా...' అన్నాడు. '... లోపలికి రా. నీవు ఇక్కడ ఉంటావని తెలిసి నీ కోసం ఈ గొడుగు నీ ముందరే వదిలేశాను. నువ్వు తప్పకుండా దానిని తిరిగి అప్పచెప్పి దానిని వదలనీయవని నాకు తెలుసు! రా... లోపలికి రా!' తను ఏదీ ఆలోచించలేక పోయిం ది. లోపలికి వెళ్లిపోయింది! నాలుగు అడుగులు వేశారు. ఇబ్బందిగానే వుంది. వాన లేకపోయి నా వీళ్లు ఎవరా గొడుగులో వెళుతున్నారని జనం విచిత్రంగా చూశారు.

'గొడుగు చిత్రమైనది...', సుబ్బారావు చెబు తున్నాడు. '... నీలా నువ్వు నడవలేవు! నాలాగా నేనూ నడవలేను. నువ్వు తడవకూ దదు. నేను తడబడకూడదు! గొడుగు లేకపోతే అంతా స్వా తంత్ర్యమే! ఇద్దరికీ అంతా దూరమే! ఇది వుం టేనే ఇంత దగ్గర... ఇది తరతరాలది! అంత రాల మాటున మరో తరానికి తరలి వెళ్లాలి...'

దూరంగా నాన్నగారు ఒక గొడుగులో ఏదో కొనుక్కుని వెళ్లిపోతున్నారు... సుమిత్ర గొడుగు చేతిలోకి తీసుకుంది. 'మన ఇంటికి వెళదాం పదండి!' నవ్వుతూ అనేసింది.

వాన పూర్తిగా వెలిసింది! ●